

యం. నరేంద్ర

# పగ్గమా - కళ్ళెమా

'మనసు మనిషిని నడిపిస్తోందా? లేక మనిషి మనసును నడిపిస్తున్నడా?' అన్నది నాకు ఆదినుంచీ కలుగుతున్న అనుమానం. ఆదినుంచీ అంటే సృష్ట్యాదినుంచీ అని కాదు అర్థం. నా వయస్సు పాతిక సంవత్సరాలే! నాగరాజు నాకంటే ఒక సంవత్సరం పెద్దవాడు.

నాగరాజు బియ్యేలో నా రూమ్మేటు. బయటినుండీ చూడడానికి విశాలంగా కనిపించే హాస్టల్లోని ఓ ఇరుకైన గదిలో మే మిద్దరం మూడు సంవత్సరాలు కాపురంచేశాము. ఒకేజాతి పక్షులు ఒకే గూటిలోకి చేరుకుంటాయని చెబుతారు. కానీ నా మనస్తత్వం వేరు. నాగరాజు వ్యక్తిత్వం వేరు మా

ఇద్దరి మధ్య స్నేహబంధం ఏర్పడడం సృష్టిలోని వింతల్లో ఒకటి. నేను సినిమాకు వెడదామంటే అతను షాపింగుకు బయలుదేరేవాడు. నేను షాపింగుకు బయలుదేరితే అతను వుమెన్సు కాలేజీ వైపు నడచేవాడు.

నాగరాజుకు ఇంగ్లీషు క్రైంపిక్చర్లంటే చాలా ఇష్టం. ఊళ్లో అలాంటి సినిమా రిలీజయిందంటే మొదటి రోజే ఎంత చెప్పినా వినకుండా కాలేజీ ఎగ్గొట్టి మార్నింగ్ షోకి అటెండయిపోయేవాడు. తీరా ఒకనాడు నేనూ మొదటి రోజే కాలేజీకి ఎగనాంపెట్టి కొత్తగా రిలీజయిన సినిమాకు బయలుదేరాను. బట్టలు మార్చుకొని నాగరాజుకోసం వెయిట్ చేస్తూ కుర్చీలో కూర్చున్నాను. ఆయనగారు ఎంతకూ చదువుతున్న పుస్తకం మూసిపెట్టలేదు. మార్నింగ్ షో టైం అవుతోంది. ఓపిక నశించిపోగా "ఏం మహానుభావా! సినిమాకు రావా?" అని అడిగాను.

"ఏం సినిమాకు?" ఏం తెలియని వాడిలా అడిగాడు నాగరాజు.

"ఈ రోజు 'ది అడ్వెంచరర్స్' రిలీజయ్యిందిగా!"

"ఓహో! అందుకా? నేనా సినిమాను చూడదలుచుకోలేదు......" గబగబా గది బయటికి వెళ్ళి ఆకాశం కేసి చూపులు సారించాను.

"అదేమిటి ? అక్కడేం చేస్తున్నావ్?" విస్తుపోతున్నట్లుగా అడిగాడు నాగరాజు.

"సూర్యుడు ఏ దిక్కున ఉదయించాడోనని!"

"నువ్వేం వెక్కిరించ నక్కర్లేదు. హైద్రాబాదులో మా ఫ్రెండొకడున్నాడు. వాడీ సినిమా నెప్పుడో చూసేశాడట! ఇంత పనికిరాని సినిమాను వాడు జన్మలో చూడనేలేదట!...

"నా స్నేహితుడూ చెప్పాడు... ఇంతమంచి సినిమా అతడు జన్మలో చూడనే లేదని......"

నాగరాజు పుస్తకం మూయలేదు.

అయిదు నిమిషాలు అలాగే కూర్చుండిపోయి, ఇక లాభంలేదన్న సంగతి అర్థం కాగానే పైకి లేచి మరో స్నేహితునితోబాటు సినిమాకు వెళ్ళిపోయాను.

ఇంటర్ వెల్ లో సీటులోంచి పైకి లేచి చుట్టూరా కలయజూసేసరికి వెనుక వరుసలోనే చిరునవ్వు నవ్వుతూ కన్పించాడు నాగరాజు. విపరీతమైన కోపం వచ్చింది. అదే రూమయితే బాగా దులిపేసేవాడిని. సినిమా హాలన్న సంగతి గుర్తుకు రాగానే మౌనంగా బయటికి నడిచాను. టీ తాగుతుండగా తానూ ఓ కప్పు తీసుకొని తాగుతూ దగ్గరికి వచ్చి "సినిమాలో కథమాత్రం బాగుండలేదు. సెట్టింగ్స్, ఏక్షన్స్ బాగున్నాయని చెప్పాడు మా ఫ్రెండు

మంచి సెట్టింగ్స్ నాకు చాలా ఇష్టం గదా! అందుకే సినిమా కొచ్చాను..." అన్నాడు మెల్లగా.

"నే నడిగినప్పుడు ఆ సంగతి గుర్తుకు రాలేదా?" అన్నాను కోపంగా.

"నువ్వే అలా మాటాడితే ఎలా! ఏదో పొరబాటయిందనుకో!"

అంతగా క్షమాపణ కోరుకున్న తరువాత ఇంకేంచేయగలను. ప్రక్క సీటు ఖాళీగానే వుంది రమ్మని ప్రక్కనే కూర్చోబెట్టుకున్నాను.

మరో రోజు. ఆ రోజు శ్రీరామ నవమి అనుకుంటాను. స్నేహితు లందరమూ రాముడి గుడికి బయలు దేరాము. విద్యార్థులు పండుగరోజు గుడికి వెళ్ళడం దేవుడిని చూడడానికి మాత్రమే గాదని అందరికీ తెలుసు. బయలుదేరేముందు తాను రావడంలేదని చెప్పిన నాగరాజు తీరా గుడిలో మా కంటె ముందుగా ప్రత్యక్షమయ్యాడు. ఎందుకిలా చేశావని అడిగితే అందుకో పనికిరాని జవాబు సరఫరా చేశాడు...

ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటేమిటి ఎన్నో సంఘటనలు చెప్పవచ్చు. మొదట మొదట మమ్మల్ని ఆశ్చర్యంలో ముంచేయాలని అలా చేస్తున్నాడేమో ననుకున్నాను. పూర్తిగా లాగితే రబ్బరుతీగ తెగిపోతుంది. ప్రతిసారి ఇలా చేస్తుంటే ఆశ్చర్యం ఎలా కలుగుతుంది?


పూర్తిగా విసిగిపోయిన తరువాత ఒకరోజు నిలదీసి అడిగాను —" ఎందుకురా బాబూ! నీ కీ గాలివాటు బుద్ధులు" అని.

చివరకు నిజాన్ని బయటపెట్టాడు. నాగరాజు — "మొదట మీరు పిలుస్తున్నప్పుడు నిజంగానే రాకూడదని అనుకుంటాను. కానీ కొద్ది క్షణాల్లో వెళ్దామని అనిపిస్తుంది...మరికొన్ని నిముషాల్లోనే బయలుదేరి వచ్చేస్తుంటాను... రాగూడదు అనుకుంటూనే వచ్చేస్తుంటాను. ఆలోచిస్తే అది నాలోని వీక్‌నెస్ ఏమో అనిపిస్తుంది..."

అతడి మాటలు నన్నూ ఆలోచింపజేశాయి. ఎవరైనా ఎక్కడికైనా పిలిచినప్పుడు ఏదైనా పని చేసిపెట్టమన్నప్పుడు అతడిలోని మనిషి ఎందుకు చెయ్యాలి అని ప్రశ్నించుకుంటాడు. చేయగూడదని నిర్ణయించుకుంటాడు. అందుకతడి మనస్సు ఒప్పుకోదు. చివరకు మనిషి ఓడిపోతాడు. చెయ్యగూడదనుకున్న పని చేసేస్తుంటాడు —" అని అనుకున్నాను చివరకు.

చదువులు పూర్తయ్యాయి. నేను కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం సంపాదించుకోగలిగాను.

నాగరాజు తండ్రి రైల్వేలో స్టేషన్ మాష్టరుగా పని చేస్తున్నాడు. కొడుకుని గూడా అదే డిపార్టుమెంటులోకి లాక్కోవాలని ఆయన ఆదినుంచీ అనుకునేవాడు. కానీ నాగరాజుకు రెవిన్యూ




డిపార్టుమెంటులో పనిచేయాలని వుండేది. కోరుకున్నదానికీ జరిగేదానికీ చాలా తేడా వుంటుంది గదా! మన దేశంలో ఎక్కువ మందికి తమ కిష్టమైన చదువులు చదవడానికిగానీ ఉద్యోగాలు చేయడానికిగానీ పరిస్థితులతోబాటు తల్లితండ్రులు గూడా అనుమతించడంలేదు. నాగరాజుకు తండ్రి ఆజ్ఞను పాలించక తప్పలేదు. ప్రస్తుతం అతడు సికింద్రాబాదులో రైల్వే డిపార్టుమెంటులోనే ఏదో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. నెలకు ఆరేడు వందలు సంపాదిస్తున్నాడు.

* * *

దసరా సెలవులు వచ్చాయి. విద్యార్థికైనా పెళ్ళికాని లెక్చరరుకైనా సెలవులొస్తే పరమానందంగా వుంటుందన్నది స్వానుభవం. హాయిగా యింటిపట్టున వుండొచ్చు. తల్లి పెట్టే కమ్మని భోజనం తినొచ్చు. – సరే, సెలవులొచ్చాయన్నది ప్రస్తుతాంశం.

ఓ రోజు సాయంకాలం షికారుకు వెళ్ళి ప్రొద్దుపోయిన తరువాత యింటికి తిరిగొచ్చాను. హాల్లోనే కూర్చుని ఏదో పత్రికను తిరగేస్తున్న నాన్నగారు "మీ ఫ్రెండట... పేరు నాగరాజట. నీ కోసం వచ్చాడు. చాలా మొహమాటస్తుడిలాగున్నాడు. నాతో ఫ్రీగా మాటాడలేకపోతూంటే వెళ్ళి నీ గదిలో కూర్చోమని చెప్పాను. అర్థగంటనుంచీ నీ కోసం వేచివున్నాడు......" అన్నారు.

గబగబా మేడపైకి వెళ్ళాను. బీరువాలోని పుస్తకాల నన్నింటినీ చెక్ చేస్తూ కనిపించాడు నాగరాజు.

"చిరకాల దర్శనం..." అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

"ఏం చెయ్యమంటావు చెప్పు. తీరికలేని పని. చివరికి ఎలాగో రెండు రోజులు వీలు కలిగించుకొని వచ్చాను" అన్నాడు నాగరాజు.

"ప్రస్తుతం ఎక్కడినుంచి వస్తున్నావ్?"

"సికింద్రాబాదునుంచే వస్తున్నాను. ఇంకా నాన్నగారి దగ్గరికి కూడా వెళ్ళలేదు. ఎకాయెకిని నీ దగ్గరికే రావడం..."

"ఊరక రారు మహాత్ములు......"

"అబ్బే పెద్ద పనేమీ లేదు... నిన్ను చూసి చాలా రోజులైంది గదా! అందుకే వచ్చాను..."

"ఓ పదిహేను నిముషాలు వెయిట్ చేస్తూవుండు నాగరాజూ! ఊరంతా తిరిగివచ్చాను గదా! ఒళ్ళంతా అలసిపోయింది. వెళ్ళి స్నానంచేసి వస్తాను" అంటూ బాత్‌రూములోకి వెళ్ళిపోయాను.

స్నానం ముగించి గదిలోకి వచ్చేసరికి అమ్మ టిఫిన్ తీసుకొచ్చింది.

"ఏమిట్రా విశేషాలు!" అడిగాను టిఫిన్ తీసుకుంటూ.

"చాలా వున్నాయి. తమరు త్వరగా తినేసి బయటపడితే అలా వెళ్ళి వద్దాము. అప్పుడు చెబుతాను..."

గబగబా టిఫిన్ కానిచ్చి బయట పడ్డాము.

"ఎలా వెడదాం?" అడిగాను.

"మీ వూరి సంగతి నాకెలా తెలుస్తుంది? ఏదైనా ప్రశాంతంగా వుండే చోటికి వెడదాం..."

"ఏకాంతమా? మా వూళ్ళోనే..." పకాలున నవ్వేశాను.

"ఏం? ఎందుకు నవ్వు?"


"నాయనా పిచ్చితండ్రీ! ఈ పట్నం ఎటుచూసినా నాలుగైదు మైళ్ళు వ్యాపించి వుంది. ఏకాంతం కోసమైతే ఆ నాలుగు మైళ్ళూ నడవాలి లేదా టౌనుబస్సు ఎక్కాలి. అవి సమయానికి దొరకవు. ఎందుకొచ్చిన గొడవ... నడుస్తూ మాటాడుకొందాం..."

ఇక తప్పదన్నట్లు మొదలుపెట్టాడు నాగరాజు - "మా నాన్నగారి కీ మధ్య పెళ్ళి పిచ్చి పట్టుకొందిరా మూర్తీ..."

"ఏమిటీ...ఈ వయస్సులోనా..." ఉలిక్కిపడ్డట్టుగా అడిగాను.

నా మాటలు పట్టించుకోకుండా చెప్పసాగాడు. "నా జీవితం ఇలా సాఫీగా నడిచిపోవడం ఇష్టంలేదట ... ఒకటే గొడవ పెడుతున్నారు వారానికి రెండు ఉత్తరాలు...అబ్బబ్బ...పెళ్ళిచేసుకో... పెళ్ళిచేసుకో...నేను పెళ్ళిచేసుకోకపోతే ఆయనకేం పోయిందో..."

"పెళ్ళి నాగరాజుకే గానీ వాళ్ళ నాన్నగారికి కాదన్నమాట! 'హమ్మయ్య' అనుకొని "చూడరా రాజూ! నీ వయస్సెంత? ఇరవైఆరు



సంవత్సరాలు...బ్రహ్మచారి ముదర కూడదు. ఆయన మాటవిని పెళ్ళి చేసుకో...దానికింత బాధెందుకు!" అన్నాను

"అబ్బే పెళ్ళాడడంలో బాధలేదు. కానీ కాబోయే జీవితభాగస్వామిని సెలక్ట్ చేసుకోవడముందే ... అందు లోనే వుంది బాధంతా..."

"ఏమిటో నీ మాటలు. నా కర్థం గావడంలేదు

"చూడ్రా మూర్తీ! పెళ్ళిచూపుల్లో ఆ అమ్మాయిని ఎంతసేపు చూస్తాం చెప్పు. ఒక పది నిమిషాలు. కేవలం పది నిముషాలు చూటడంవల్ల ఆ అమ్మాయి మంచిచెడ్డలు మన కెలా తెలుస్తాయి?"

"అందుకే ఇప్పుడు పెళ్ళిచూపుల్లో ఓ అరగంటసేపు అమ్మాయి అబ్బాయి మాటాడుకొని ఒకరి మనస్సు నొకరు తెలుసుకోడానికి ఏకాంతం ఏర్పరుస్తారు తెలుసా?"

"నిజమే! నేనూ అలాగే మాటా డాను. నువ్వు నిజమనుకో, అబద్ధ

మనుకో...నేను ఇంతవరకూ దాదాపు పదిహేను పెళ్ళిచూపులకు వెళ్ళాను!"

ఉలిక్కిపడి, "పదిహేనుసార్లే!... చూచిన పదిహేనుమందిలో ఏ ఒక్కరైనా నచ్చలేదన్నమాట!" అన్నాను.

"అక్కడే పొరబడుతున్నావు కేవలం అందాన్నిమాత్రం చూసి పెళ్ళాడడం అవివేకం. మనిషి మనస్తత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ, సౌశీల్యాన్నీ లెక్కగట్టాలి"

ఏమిటో నాగరాజు ధోరణి నాకర్థం గావడంలేదు. కేవలం అరగంటసేపు మాటాడడంతోనే ఎదుటివాళ్ళ గుణగణాల్ని ఎలా లెక్కగట్టగలం? ఆ మాటే అడిగాను...

"అందుకో ప్రొసీజర్ కనిపెట్టాను..."

"ఏమిటో అది?"

"నా పరీక్షను రెండు భాగాలుగా విభజిస్తాను. మొదటి యాభై శాతం మార్కులు అందానికి ... తరువాత ఆమెను నేను కొన్ని ప్రశ్న లడుగుతాను. ఆ ప్రశ్నల కన్నింటికీ ఆమె చెప్పే జవాబులనుబట్టి మిగిలిన యాభై మార్కులిస్తాను రెండూ కూడితే డెబ్భై శాతం మార్కులొస్తేనే పెళ్ళాడ్డానికి నిర్ణయించుకున్నాను..."

"అంటే నీ పరీక్షలో ఫస్టుపేపరు బ్యూటీ-టెస్ట్. రెండో పేపరు ఓరల్ టెస్ట్ - అలా చెప్పు ... బాగుంది బాగుంది." ఇంతలో మళ్ళీ పాత అనుమానం వచ్చింది - "అయితే ఆ పదిహేను మందిలో ఎవరికిగానీ డెబ్భై శాతం మార్కులు రాలేదన్న మాట..."

"అన్నమాట మాత్రమే గాదు. ఉన్నమాటే...ఒక్కరికి గూడా నలభై మార్కులు రాలేదు."

మొత్తంమీద నాగరాజు విచిత్రమైన వ్యక్తి. విచిత్రమైన విషయాలపైన చాలా ఇంట్రెస్టుంది నాకు అందుకే ఆ ప్రశ్నలు ఏవిటో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది.

"ఇక నడచింది చాలుగానీ ఆ హోటలుకు వెళ్ళివద్దాం పద..." అంటూ అటువైపుకు నడిచాను. కాఫీకి ఆర్డరిచ్చాక ఓ మూలగా సందడిలేని చోట కూర్చుని తరువాత అడిగాను - "మా ఇంట్లో గూడా ఇప్పుడిప్పుడు పెండ్లి పెండ్లి - అంటూ మాటాడుకుంటున్నారు ఇక తప్పదు గదా! నేనూ పెళ్ళిచూపులకు బయల్దేరాల్సిందే. నువ్వెలాగూ బుర్రచించుకొని ఓ ప్రశ్నాపత్రాన్ని తయారుచేశావు దయచేసి ఆ ప్రశ్నలేమిటో చెప్పవోయ్ నాగరాజూ! బాబ్బాబూ, నీకు పుణ్యముంటుంది—" ప్రాధేయపడ్డాను.

"అన్నం వుడికిందో లేదో తెలియడానికి ఒక్క మెతుకును పరీక్షిస్తే చాలు. అంతే గదూ! మనస్తత్వాన్ని

తెలుసుకోడానికి మచ్చుకు నాలుగైదు ప్రశ్నలడిగితే చాలు – ఏమంటావ్?"

తలవూపాను

"మరింక ప్రశ్నలేవిటో చెబుతాను విను

నెంబర్ వన్ – భార్యాభర్తల్లో ఏవరి స్థానం గొప్పది? నెంబర్ టూ – సాయంకాలం అయిదు గంటలకే వచ్చి సినిమాకు తీసుకవెడతానని ప్రామిస్ చేసిన భర్త రాత్రి పదిగంటలకు నింపాదిగా ఇంటికి దయచేస్తే ఆ భార్య ఏం చేయాలి? నెంబర్ త్రీ – సిగరెట్లు త్రాగే మగవాడిపైన మీ అభిప్రాయం ఏమిటి? నెంబర్ ఫోర్ – మీ భర్త అప్రయోజకుడైన నీతిపరుడై వుండాలా? లేక ప్రయోజకుడైన అవినీతిపరుడై వుండాలా?"

ఇంతలో కాఫీ వచ్చింది మౌనంగా ఆ ప్రశ్నలను గురించి ఆలోచిస్తూ కాఫీ తాగేశాను.

"నాగరాజూ! నువ్వేం అనుకోకపోతే నాదో కోరిక. ఆ ప్రశ్నలను నిన్నే అడిగి వాటికి నీ సమాధానాల్ని కూడా తెలుసుకోవాలని వుంది...నా కోరిక తీరుస్తావా? ప్లీజ్..." కౌంటర్లో బిల్లు చెల్లించేసిన తరువాత, అడిగాను.

నాగరాజు నన్ను ఓ క్షణం అర్భకుణ్ణి చూసినట్లుగా చూసి "అడుగు..." అన్నాడు చిరునవ్వు నవ్వుతూ...

"అలాగయితే నే నిప్పుడు పెళ్ళి సంబంధం చూడడానికొచ్చిన అబ్బాయి నన్నమాట! నువ్వేమో..."

"పెళ్ళి పరీక్షకు కూర్చున్న అమ్మాయినన్న మాట..." గలగలా నవ్వేసి "మరి పరీక్ష మొదలు పెట్టు" అన్నాడు.

పరీక్ష మొదలు పెట్టాను –

"భార్యా భర్తల్లో ఎవరి స్థానం గొప్పది?"

"సంసారమనే యాత్రలో భార్యాభర్తలు తోడుగా పయనించే యాత్రికుల లాంటివాళ్ళు...వాళ్ళల్లో తక్కువ ఎక్కువ అన్న వ్యత్యాసం వుండదు... భర్త స్దానం ఎంత గొప్పదో భార్య స్థానం గూడా అంతే గొప్పది..."

"సినిమాకు తీసుక వెడతానన్న భర్త పది గంటలకు ఆలస్యంగా దయచేస్తే ఆ భార్య ఏం చేయాలి?"

"భర్త పరిస్థితి అర్థం చేసుకుని 'అయ్యో' ఏమిటండీ అలా వున్నారు... ఏం జరిగింది? తల నొస్తూందా? అమృతాంజనం రాయమంటారా? కాఫీ పెట్టి తీసుకరమ్మంటారా? అంటూ కంగారు పడిపోవాలి..."

"సిగరెట్టు త్రాగే మగవాడిపైన మీ అభిప్రాయం?"

"మరీ ఎక్కువ తాగేవాళ్ళని చూస్తే కోపం వస్తుంది. అలాగని తాగకుండా వుండే వాళ్ళని చూస్తే వాళ్ళ పిరికితనానికి నవ్వుకోవా లనిపిస్తుంది.

లిమిట్‌గా తాగేవాళ్ళని చూస్తే చాలా ఇష్టం..."

"చివరి ప్రశ్న - మీ భర్త అప్రయోజకుడైన నీతిపరుడై వుండాలా! లేక ప్రయోజకుడైన అవినీతిపరుడై వుండాలా?"

''నీతిపరుడై వుండాలి. అప్రయోజకుడైనా పర్వాలేదు..."

నాగరాజు ఆ ప్రశ్నల కిచ్చిన జవాబులు బాగున్నాయని అనుకోకుండా వుండలేక పోయాను,

* * *

జరుగుతున్నది ఎండాకాలం కాబట్టి మేడపైన కొబ్బరిచెట్ల ఆకుల్లోంచీ తొంగి చూస్తున్న చంద్రుడి చిరువెల్తుర్లో మంచాలు వంచుకుని, పడుకున్నాము, కాళ్ళదగ్గర పడివున్న దుప్పటిని గొంతు దాకా లాక్కుంటూ ''రేపు మధ్యాహ్నం దాకా నువ్వు నాతోనే తిరగాలి రామూర్తీ! మనమిద్దరం కలసి ఓ చోటుకు వెళ్ళి రావాలి, మధాహ్నం రెండు గంటలకు ఊరికి వెళ్ళిపోతాను..." అన్నాడు నాగరాజు నింపాదిగా.

''ఎక్కడికి వెళ్ళాలి?"

"ఈ వూర్లో చక్రపాణి గారని ఒక రిటైర్డు స్టేషనుమాష్టరున్నారులే! వాళ్ళింటికి వెళ్ళాలి?"

నేను ఉలిక్కిపడ్డ మాట నిజం! కానీ లేచి కూర్చోలేదు. ఎదుటివ్యక్తితో చెలగాట మాడ్డమే నాగరాజుకు సరదా అయినప్పుడు - దాన్ని మరింత రసవంతంచేసే అవకాశాన్ని నేనెందుకు పోగొట్టుకోవాలి? అందుకని వీలయినంత నెమ్మదిగా ప్రశ్నించాను - "చక్రపాణిగారి ఇంటికా? ఎందుకూ?" అని.

"మరేం లేదు ... వయసొచ్చిన అమ్మాయి ఒకతె వుందని తెలిసిదంటే వెంటనే అక్కడికి వెళ్ళి ఆ అమ్మాయిని చూసిరమ్మని ఆర్డరు జారీ చెయ్యడం మా నాన్నగారికి అలవాటైపోయింది..."

'చిక్కావురా మిడతంబొట్టూ' అనుకున్నాను. ఎందుకంటే చక్రపాణిగారంటే ఎవరో కాదు. స్వయానా నాకు వేలువిడిచిన చిన్నాన్నగారు - అంటే ఇతగాడు పెళ్ళిచూపులకంటూ రావడం మా శోభను చూడ్డానికే నన్నమాట!

నాగరాజు అప్పుడే నిద్రాదేవత కౌగిల్లోకి జారిపోయివుండడం గమనించి నేనుగూడా ముసుగు బిగదన్నుకున్నాను.

* * *

నాగరాజు స్నేహితుడన్న విషయాన్ని మరచిపోయి నాకు ఎంతో ఇష్టమైన ఒక అమ్మాయికి భర్తగా అతడెంతవరకూ తగివున్నాడని ఆలోచించాల్సిన అవసరం ఏర్పడుతుందని కలలోనైనా అనుకోలేదు.



'ఉద్యోగం పురుషలక్షణం' — అంటారు పెద్దలు. నాగరాజుకు సలక్షణమైన ఉద్యోగం ఒకటుంది. నెలకు ఆరేడువందలు సంపాదిస్తున్నాడు. పొడుగ్గా అందుకు తగ్గ లావుతో హుందాగా అందంగా కన్పిస్తాడు. రోజుకో అయిదారు సిగరెట్లు కాలుస్తాడు. అంతకు మించిన దురలవాటు మరొకటి లేదు. లేదంటే ఎదుటి మనిషితో దాగుడుమూత లాడుతాడు. అది అతనిలో బలహీనత...అదేమంత పెద్ద అభ్యంతరం కాదు.

ఉదయం అయిదుగంటలకల్లా ప్రక్కింటి ఫ్రెండు నడిగి స్కూటరు తీసుకొని బాబాయి ఇంటికి పరుగెత్తాను. నేను వచ్చానన్న సంగతి తెలియగానే శోభే కాఫీ తీసుకొచ్చింది. కాఫీ త్రాగేసి ఖాళీకప్పు తిరిగి ఇచ్చేస్తూ

"అలా మేడమీది గదిలోకి వస్తావా శోభా! నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి!" అన్నాను.

"అలాగే!" అంటూ ఆమె వంట గదిలోకి వెళ్ళిపోయింది.

మేడమీది గదిలో కూర్చుని పేపరు చూస్తూ వుండగా శోభ వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చొంది. పేపరు చూస్తూనే ఎలా మొదలుపెట్టాలో ఆలోచించి చివరకు, "ఈ రోజు నిన్ను చూడడానికి ఎవరో ఒక అబ్బాయి వస్తున్నాడట" అన్నాను.

"అవునట!"

"ఆ అబ్బా యెవరో తెలుసా? నా ఫ్రెండు. ప్రస్తుతం మా ఇంట్లోనే వున్నాడు!"

"అలాగా!" అంది ఆమె ముక్త సరిగా.

"ఏమిటంత మామూలుగా అంటు న్నావు? నీ కాబోయే భర్త నా ఫ్రెండే కావడం ఆశ్చర్యంగా లేదూ! వాడెలా వుంటాడో తెలుసుకోవాలని అనిపించడం లేదూ!" అన్నాను ఆశ్చర్యంగా!

"ఆమె కాస్సేపు మౌనంగా వుండి పోయి చివాలున తల పైకెత్తి నా కళ్ళ ల్లోకి సూటిగా చూస్తూ "అన్నయ్యా! నా వయస్సు ఇప్పుడెంతని అనుకుంటు న్నావ్?" అంది.

"నాకు తెలియదేమిటి? పదిహేడు సంవత్సరాలు దాటి వుంటుంది"


"అవును. కనీసం ఇరవై సంవత్స రాలైనా నిండకుండా అప్పుడే ఈ పెళ్లెం దుకు చెప్పు? నా కిప్పుడే పెళ్ళిచేసు కోవడం ఇష్టంలేదు. కనీసం బి.యస్.సి. - అయినా పూర్తవాలి..."

"చూడు శోభా! నువ్వింకా చిన్న దానివి! ఏది మంచిదో ఏది మంచిది కాదో నీకింకా తెలియదు. నువ్వెంత చదివినా ఒకనాటికి పెళ్ళిచేసుకోని తీరవలసిందే గదా! అప్పుడు ఇంత మంచి సంబంధం వస్తుందని ఏమిటి గ్యారంటీ! మంచి అవకాశాలను పోగొట్టుకోవడం బుద్ధిమంతుల లక్షణం గాదు. మా నాగరాజును గురించి నాకు బాగా తెలుసు. అందంగా వుంటాడు...మంచి ఉద్యోగం చేస్తున్నాడు. భార్యను సుఖపెట్టగల వాడు... పెద్దవాడ్ని ... నేను చెబు తున్నాను విను...నా మాట విని వాడిని పెళ్ళిచేసుకో..."

"......"

శోభ నోరు తెరవలేదు. మౌనం అర్ధంగీకార మన్నారు కదా! "పిచ్చిపిల్ల! దానికేం తెలుస్తుంది? పెద్దవాళ్ళు నచ్చ జెప్పితే ఒప్పుకోకపోతుందా?

"చూడమ్మా! నే నిప్పుడొచ్చింది నీతో ఓ ముఖ్యమైన సంగతి చెప్పడానికి. మావాడు చాలా కచ్చితమైన వ్యక్తి. వాడు పెళ్ళిచూపుల్లో కొన్ని ప్రశ్న లడుగుతాడు. వాటికి సమాధానాలు



చెబితేనే ఈ పెళ్ళికి ఒప్పుకుంటాడు. ఆ ప్రశ్నలేవిటో నాకు తెలుసు. వాటికి జవాబులు కూడా తెలుసు..."

"బాగుంది బాగుంది...ఆయనగారి ప్రశ్నలకు నేను సమాధానా లివ్వాలేమిటీ? ఆయనేమైనా లాయరా లేక ఐ.ఏ.యస్. ఆఫీసరా?"

"ఆగు శోభా! కాస్సేపు నోరు మూసుకోని నా మాట విను."

నాగరాజు తయారుచేసిన ప్రశ్నలను ఆవిడకు తెలియజేసి వాటికి సమాధానాలు నేనే చెప్పి వాటినే మరచిపోకుండా చెప్పమని హెచ్చరించాను.

చివరకు శోభ దగ్గర "అలాగే అన్నయ్యా" అన్నమాటను రాబట్ట గలిగాను.

ఇంటికి వచ్చి నాగరాజు ఏం చేస్తు న్నాడోనని చూచాను. కొబ్బరి చెట్ల ఆకుల్లోంచీ జల్లుజల్లుగా సూర్యుడి కిరణాలు మీదపడుతున్నా లెక్కచెయ్యకుండా నిండుగా కప్పుకున్న దుప్పటి లోంచీ గురక పెద్దగా వినపడుతోంది.

* * *

పక్క ప్రక్క కుర్చీల్లో కూర్చుని నేనూ నాగరాజూ చల్లటి పండ్లరసాన్ని తాగుతుండగా పిన్ని శోభను తీసుకొచ్చి ఎదురుగా చాపపైన కూర్చోబెట్టింది. నాగరాజు వైపు చూచాను. అతను జ్యూస్ తాగుతున్నట్లే నటిస్తూ ఓరగా ఆమెను పరిశీలిస్తున్నాడు. వాడి బ్యూటీ టెస్ట్‌లో నా చెల్లెలి కెన్ని మార్కులొస్తా యన్న సందేహం కలగగానే శోభ వైపు పరిశీలనగా చూచాను. తెల్లటి చీర, తెల్లటి జాకెట్టు, నిండుగా కప్పుకున్న పవిటపైన బంగారు గొలుసు, మొహం కాంతికంతటికీ కేంద్రంలా కనబడుతున్న చిన్న కుంకుమబొట్టు, చేతికి ఎఱ్ఱ గాజులు, వాటికి బార్డరులాగా బంగారు గాజులు—నాగరాజు బ్యూటీ టెస్ట్‌లో మా చెల్లెలికి డిస్టింక్షన్ గ్యారంటీ!

అమ్మాయికీ అబ్బాయికీ ఏకాంతం కలిగిద్దామన్న తలంపువల్ల గావచ్చు – పిన్నీ బాబాయి కళ్ళతోనే సంజ్ఞలు చేసుకొని లోపలికి వెళ్ళిపోయారు.

'ఇక మొదలుపెట్టు' అన్నట్లుగా చూశాను నాగరాజు వైపుకు.

నాగరాజు మెల్లగా నోరు విప్పాడు.

"మీ పేరు...?"

"శోభారాణి" శోభ మరీ ఎక్కువగా సిగ్గు పోకుండా మాట్లాడుతోంది. పర్వాలేదు.

"చూడండి. మీరు మరేమీ అనుకోకపోతే నేను కొన్ని ప్రశ్నలడుగుతాను...మీకు నచ్చిన సమాధానాలు చెబుతారా?..."

శోభ తల పైకెత్తి నా ముఖంలోకి చూచింది. పర్వాలేదు, ధైర్యంగా చెప్పమన్నట్లు ఓ చిరునవ్వు నవ్వాను. ఆమె అడగమన్నట్లు తల వూపింది. నాగరాజు తన మొదటి బాణాన్ని వదిలాడు—

"భార్యా భర్తల్లో ఎవరి స్థానం గొప్పది?"

ఆమె మెల్లగా చెప్పసాగింది —

"ఈ ప్రశ్నను మీరు చాలా ఆలస్యంగా అడుగుతున్నారు. పురాణకాలంనుంచీ వస్తున్న సందేహమే ఇది. మనం దేవతలను సీతారాములు, రాధాకృష్ణులు, పార్వతీపరమేశ్వరులు – అని అనడంలోనే స్త్రీకిగల ప్రత్యేకత, గొప్పతనం తెలుస్తూంది."

ఉలిక్కిపడ్డాను. కోపంతో పిడికిలి బిగించి దాన్ని టేబుల్‌కేసి నొక్కుతూ అక్కడి కక్కడే అణచివేయడానికి ప్రయత్నంచేశాను. కానీ నా బాధ నాగరాజుకు అర్థమైనట్లు లేదు. అతడు తన ప్రశ్నలను అడుగుతూనే వున్నాడు.

"సాయంకాలం అయిదు గంటలకే వచ్చి సినిమాకు తీసుకెడతానని ప్రామిస్ చేసిన భర్త రాత్రి పదిగంటలకు వస్తే మీరేం చేస్తారు?"

ఆమె కాస్సేపు ఆలోచించినట్లు ఆగి




"ఈ ప్రశ్నకు రెండు రకాలైన సమాధానాలు చెబుతాను. మొదటిది – మీరు అలస్యంగా వస్తారన్న విషయం నాకు తెలుసు. అందుకే ప్రక్కింటి పిన్నిగారితో మ్యాట్నీకే వెళ్ళి వచ్చేశాను - అని అనాలి. రెండోది:–అరె! సినిమానా? ఆ మాటే మరచిపోయాను. మీరు సినిమా అంటూంటే గుర్తుకు వస్తోంది - అని జవాబు చెప్పాలి."

"సిగరెట్లు త్రాగే వ్యక్తిపైన మీ అభిప్రాయం?"

"సినిమా హాల్సులో "పొగత్రాగరాదు." అన్న బోర్డు తగిలించినా చీకట్లో సిగరెట్లు త్రాగేస్తుంటారు కొందరు. మరికొందరు మీటింగుల్లో సైతం ఏదో అర్జెంటుపని వున్నట్లు బయటికి పరిగెత్తి గబగబా సిగరెట్లు వెలిగించేస్తుంటారు. క్లాసులో పాఠాలు చెప్పే టీచర్లు సైతం సగం పాఠంలో ఆపేసి బయటకి వెళ్ళి చెట్ల చాటుల్లో పొగ త్రాగేస్తుంటారు. అలవాటుకు బానిసలై పోతున్నవాళ్ళని చూస్తూగూడా పొగ తాగే వాళ్ళంటే నాకు అసహ్యం లేదన్న విషయం ఎలా చెప్పకుండా వుండగలను?"

"చివరి ప్రశ్న - మీ భర్త అప్రయోజకుడైన నీతిపరుడై వుండాలా? లేక ప్రయోజకుడైన అవినీతిపరుడై వుండాలా?"

"ఈ ప్రశ్న మరీ విచిత్రంగా వుంది. మీ భర్త కాళ్ళుండి కాళ్ళులేనివాడై వుండాలా, లేక కళ్ళుండి కాళ్ళు లేనివాడై వుండాలా? – అని అడుగుతున్నట్లుగా వుంది. ఏ స్త్రీ అయినా తన భర్త సలక్షణంగా వుండాలనీ, ఏ అవ

లక్షణమైనా లేనివాడై వుండాలనీ కోరు కొంటుంది..."

తనడగవలసిన ప్రశ్నలు ముగిశాక నావైపు చూశాడు నాగరాజు. అవమానంతో ముడుచుకపోయిన నా ముఖాన్ని అవతలకి తిప్పుకున్నాను.

ఇంతలో బాబాయి వచ్చేశాడు. "నువ్వెళ్ళమ్మా!" – ఆయన చెప్పగానే శోభ మౌనంగా లేచి లోపలికి వెళ్ళింది.

"మా బాబాయితో మాటాడుతూ వుండరా నాగరాజూ! నే నిప్పుడే వస్తాను..." అంటూ లోపలికి వెళ్ళాను. వంట గదిలో డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని ఏదో పత్రికను తిరగేస్తోంది శోభ. కోపంతో ఆ పత్రికను లాక్కొని "నీ కసలు బుద్ధుందా?" అన్నాను.

ఆమె సమాధానంగా చిరునవ్వు నవ్వింది.

ఆ నవ్వు నా కోపాన్ని చల్లార్చడానికి బదులుగా రెట్టింపు చేసింది

"నా మాట నీకు లెక్కలేదన్న మాట! ఆల్ రైట్! ఇక నేనసలీ ఇంటికి రానేరాను. వచ్చినా నీతో మాటాడను..." ఆ అమ్మాయితో అంతకంటే ఎక్కువగా మాట్లాడడం ఇష్టంలేక కోపాన్ని దిగమింగుకొని తిరిగి వచ్చేశాను.

"ఇక వెళ్దామా మూర్తీ!" అన్నాడు నాగరాజు నన్ను చూడగానే.

"అలాగే" అంటూ బాబాయి వైపు తిరిగి "మేము వెళ్తాం బాబాయ్! నాగరాజు రెండుగంటల రైలుకే వెళ్ళిపోతానని అంటున్నాడు...అర్జెంటు పనులున్నా యట—" అన్నాను.

"అలాగే! వెళ్ళిరండి" అన్నాడు ఆయన పైకి లేస్తూ.

గుమ్మందగ్గరికి వచ్చి ఆగిపోయాను. నాగరాజు ఏమైందన్నట్లు చూచాడు. "చూడు ఎండ ఎలా దంచేస్తోందో!" అన్నాను.

"వచ్చేటప్పుడు రిక్షాలో రావడం వల్ల బ్రతికిపోయాం. ఇప్పు డెలా?" అంటూ అంతలోనే ఆగిపోయి రోడ్డు పైన దూరంగా పరుగెడుతున్న జట్కా బండిని కేకేశాడు నాగరాజు.

జట్కాలోకి ముందుగా నే నెక్కి కూర్చున్న తరువాత అతనూ ఎక్కి కూర్చుంటూ కడపలోనే నిలచిపోయిన బాబాయితో "ఇంటికి వెళ్ళగానే వుత్తరం వ్రాస్తాను...వెళ్లొస్తానండీ" అన్నాడు.

నేను జట్కా బండివాడితో అడ్రసు చెప్పి పరుగెత్తించమన్నాను.

అయిదు నిముషాలు బరువుగా నిశ్శబ్దంగా గడచిపోయాయి. నాగరాజే మొదట మాట్లాడాడు - "అమ్మాయి నచ్చిందిరా మూర్తీ!"

రెండోసారి ఉలిక్కిపడ్డాను. వాడి

వైపు ఆశ్చర్యంగా చూచాను. వినలేననుకున్న మాట వినినందువల్ల కావచ్చు — గుండె వేగంగా కొట్టుకుంటోంది.

'నాగరాజు మారలేదు. వాడు చెయ్యగూడదనుకున్న పనిని చెయ్యకుండా వుండలేకపోతున్నాడు. వాడంతే! వాడు మారడు' — దీర్ఘంగా నిట్టూర్చాను.

క్షమాపణ చెప్పుకుంటున్నట్టుగా చెప్పాడు నాగరాజు — "నువ్వా ప్రశ్నలు అడిగినప్పుడు నేను చెప్పిన జవాబులు వేరని ఆశ్చర్యపడుతున్నావు గదా! నాకు తెలుసు! నువ్వేమని అడిగావు — నేనే ఆడపిల్లనైతే ఏం సమాధానాలు చెబుతానో ఆ సమాధానాలు చెప్పమన్నావు. అంతేగానీ ఆ ప్రశ్నలే నే నడిగితే ఎలాంటి జవాబులు చెప్పాలి?' అని అడగలేదు. అవునా?" కాస్సేపు ఆగి మళ్ళీ చెప్పసాగాడు.

"అయస్కాంతాలను గురించి నీకు తెలుసుననుకుంటాను..సజాతి ధృవాలు ఆకర్షించుకోవు ... విజాతి ధృవాలే ఆకర్షించుకుంటాయి. అలాగే ఒకే మనస్తత్వం వున్నవాళ్ళ కాపురంలో సంతోషం వుండదు. అంతేగాక చిన్నచిన్న తగాదాలు లేకుంటే సంసారంలో వెరైటీ ఏముంటుంది చెప్పండి?"

నేనుగాక మరెవడైనా అయితే అతడు చెప్పిన మాటలు నమ్మేసేవాడే! కానీ నాకు నాగరాజు సంగతి బాగా తెలుసు—నే నెలా నమ్ముతాను.

నేను వాడి మాటలు విని విస్తుపోయానేమోనని చూచాడు నాగరాజు. కానీ నేను చిరునవ్వు నవ్వుతుండడం చూచి వాడే విస్తుపోయాడు.

ఉన్నట్టుండి బండి పైకి లేచి మళ్ళీ క్షణంలో సర్దుకొంది. నాగరాజు నాకంటే పొడుగు. వాడి తల జట్కాబండి పై భాగానికి తగిలింది. "ఏవిటోయ్ అది!.. జట్కా నడపడం రాకపోతే ఎలా? ఇలా ప్రయాణీకుల తలలు పగలగొట్టడమేనా నీ పని?" అంటూ బండి వాడ్ని కసురుకొన్నాడు.

"పొరబాటయ్యింది సార్! ఈ గుఱ్ఱం బలే పొగరుమోతు...చూడండి ట్రాఫిక్‌లో ఎలాపరుగెత్తాలనిచూస్తోందో, ఒక్క క్షణం అలా ఆదమరిచానేమో! పరుగెత్తబోయింది. వెంటనే కళ్ళెం లాగాను అందుకే అంత పెద్ద కుదుపు వచ్చింది ——" కళ్ళాన్ని మరీ వెనక్కు లాగి చేతిజాటీతో గుఱ్ఱానికి ఒక పెద్ద దెబ్బనుప్రసాదిస్తూ అన్నాడు జట్కావాడు.

---